క్లుప్తంగా

రేపు లక్ష్మీనరసింహస్వామి జయంతి



లక్ష్మీనరసింహస్వామి మూల విరాట్

గుత్తి: పట్టణంలోని కోటలో కొండపై వెలిసిన పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం స్వామి జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు నరసింహ, అంజి, నాగయ్య తెలిపారు. ఈ మేరకు సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. లక్ష్మీనరసింహస్వామి జయంతి వేడుకల్లో భాగంగా సత్యనారాయణ వ్రతం, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

ముస్లిం బాలురకు ఉచితంగా ఖత్నా



సున్తీ చేయించుకున్న బాలురకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న అంజుమన్ కమిటీ పెద్దలు

గుంతకల్లుటౌన్: స్థానిక అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో మొదటి విడతగా 18 మంది పేద ముస్లిం బాలురకు ఉచితంగా ఖత్నా (సున్తీ) చేయించారు. సోమవారం అంజుమన్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరంలో వైద్యులు, సిబ్బంది బాలురకు సున్తీ చేశారు. అనంతరం బాలురకు నెలరోజుల పాటు సరిపడ పౌష్టికాహారం కిట్లు, మందులను కమిటీ సభ్యులు ఉచితంగా అందజేశారు. వైద్యశిబిరానికి హాజరైన పిల్లలు, వారి తల్లిదండ్రులకు భోజన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో పట్టణ ప్రభుత్వ అడిషనల్ ఖాజీ సత్తార్‌సాబ్, డాక్టర్ ఫిరోజ్ అహమ్మద్, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ జాఫర్, గౌరవాధ్యక్షుడు టీఎస్.అబ్దుల్ రహిమాన్, సభ్యులు హాజీ అక్బర్‌సాబ్, ఆర్‌డీజీ బాషా, అఫ్రోజ్‌ఖాన్, వలిబాష, షాషావలి, అష్రఫ్, హుసేన్, అస్లామ్ తదితరులు పాల్గొన్నారు. త్వరలో రెండో విడత ఖత్నా కార్యక్రమం నిర్వహిస్తామని జాఫర్ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

పుట్లూరు: మండల కేంద్రంలోని ఎంఎస్ మెడికల్ షాపు వద్ద సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అనంతపురానికి చెందిన కిమ్స్ సవేరా ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో పుట్లూరుతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన 120 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు.

బాటిళ్లు, క్యాన్‌లో పెట్రోల్ విక్రయిస్తే చర్యలు

పుట్లూరు: బాటిళ్లు, క్యాన్‌లో పెట్రోల్ విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మల్లికార్జున స్వామి హెచ్చరించారు. సోమవారం ఆయన మండలకేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. పెట్రోల్ బంక్‌ల వద్ద నిబంధనలకు విరుద్ధంగా బాటిళ్లలో పెట్రోల్ విక్రయిస్తే సమాచారం అందించాలన్నారు. అలాగే జూన్ 25వ తేదీ వరకూ గ్రామాల్లో జాతరలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించడానికి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

జూ.ఎన్టీఆర్ అభిమానుల రక్తదానం

గుత్తి: పట్టణంలోని మహర్షి దయానంద గురుకుల పాఠశాలలో సోమవారం తెలుగు హీరో జూనియర్ ఎన్టీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని 50 మంది అభిమానులు రక్తదానం చేశారు. జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాజు, సాదిక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.

శిక్షణ తరగతులను వినియోగించుకోండి



చిన్నారులకు నృత్యం నేర్పిస్తున్న మాస్టర్

గుంతకల్లుటౌన్: స్థానిక వన్‌టౌన్ పీఎస్ వద్ద ఉన్న ప్రభుత్వ ప్రథమశ్రేణి గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి కమ్మన్న సోమవారం తెలిపారు. గత ఐదు రోజులుగా ప్రముఖ చిత్రకారుడు శ్రీధరన్ ఆధ్వర్యంలో పిల్లలకు చిత్రలేఖనంలో మెళకువలను నేర్పించేందుకు తరగతులను ప్రారంభించామన్నారు. అలాగే సంగీతం, నృత్యం నేర్పించనున్నట్లు ఆయన తెలిపారు. క్యారమ్ బోర్డు, ఇతర ఇండోర్ గేమ్స్‌పై కూడా తర్ఫీదు ఇస్తున్నారని, విద్యార్థులు వేసవి సెలవుల్లో బయట తిరగకుండా శిక్షణ తరగతులను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది హేమలత, రాము పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం

- తుపాను ప్రభావంతో ముందస్తు వర్షాలు
- వ్యవసాయ పనుల్లో రైతన్నలు
- విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్లు మొదలు





దంచర్ల ఆర్బీకేలో వేరుశనగకు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న రైతులు, పొలంలో సేద్యం చేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ఖరీఫ్ సాగుకు అన్నదాతలు సన్నద్ధమవుతున్నారు. తుపాను ప్రభావం కారణంగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు ముందే వర్షాలు పడి భూములు పదును కావడంతో రైతన్నలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. గుంతకల్లు మండలంలో దాదాపు 55 వేల ఎకరాల సాగుభూమి ఉండగా ఏటా సుమారు 45 వేల ఎకరాల్లో ఖరీఫ్ సీజన్‌లోనూ, మరో 10 వేల ఎకరాల్లో రబీ సీజన్‌లోనూ పంట సాగవుతుంది. మండలంలో రైతులు దాదాపు 20 వేల ఎకరాల్లో వేరుశనగను ప్రధాన పంటగా సాగు చేస్తుండగా, మరో 15 వేల ఎకరాల్లో కంది పంటను, మిగిలిన 5 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేస్తూ వస్తున్నారు. ఖరీఫ్ సీజన్ పంట సాగు సమయంలో నైరుతి రుతుపవనాల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూసే రైతన్నలకు ఈ ఏడాది తుపాను ప్రభావంగా కురుస్తున్న వర్షాలు వరంగా మారాయి. త్వరలో నైరుతి రుతుపవనాలు కూడా రానుండటంతో అన్నదాతలు ముందస్తు పంటసాగుకు సిద్ధం అవుతున్నారు. దీనికి తోడు ప్రభుత్వం సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ చేసేందుకు శ్రీకారం చుడుతూ ఆయా గ్రామాల ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించింది. ఈనెల 24 నుంచి విత్తన వేరుశనగ పంపిణీ చేయనున్నారు

ముందస్తు వర్షాలు లాభదాయకం

జూన్ మొదటివారంలో నైరుతి రుతుపవనాల రాకతో ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతుంది. అయితే తుపాను ప్రభావం కారణంగా గడచిన నాలుగు రోజుల వ్యవధిలో గుంతకల్లు మండలంలో దాదాపు 10 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. ముందస్తు వర్షాలు రైతులకు లాభదాయకం. ఇప్పటికే సేద్యం పనులు పూర్తి చేసుకున్న అన్నదాతలు పంటల సాగుకు సిద్ధమయ్యారు. ఈ ఏడాది విత్తన వేరుశనగను ప్రభుత్వం ముందుగానే పంపిణీ చేస్తుండటంతో రైతులకు కలిసొచ్చింది.

– స్వాతి, ఏఓ, గుంతకల్లు

సబ్సిడీ వేరుశనగ సద్వినియోగం చేసుకోండి



తరిమెల ఆర్బీకేలో విత్తన వేరుశనగను పరిశీలిస్తున్న వ్యవసాయ సిబ్బంది, రైతులు

గార్లదిన్నె: ఆర్బీకేల్లో రైతులకు పంపిణీ చేసే సబ్సిడీ విత్తన వేరుశనగను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ సోమశేఖర్ సూచించారు. సోమవారం ఏఓ మాట్లాడుతూ ఆర్బీకేల్లో రైతులకు సబ్సిడీ వేరుశనగను రిజిస్ట్రేషన్ చేస్తున్నామన్నారు. ఈ నెల 24 నుంచి వేరుశనగ పంపిణీ చేస్తామన్నారు. 40 శాతం సబ్సిడీతో 30 కేజీల బ్యాగుకు రూ.1,710 రైతులు చెల్లించాలన్నారు. ఒక్కో రైతుకు మూడు బ్యాగులు పంపిణీ చేస్తామన్నారు.


395 మంది రైతుల పేర్లు నమోదు

శింగనమల: మండలంలోని ఆర్బీకేల్లో ఇప్పటివరకు 395 మంది రైతులు 354 క్వింటాళ్ల వేరువనగ కోసం పేర్లు నమోదు చేయించుకున్నట్లు సోమవారం ఏఓ అన్వేష్‌కుమార్ తెలిపారు. మండలానికి 2వేల క్వింటాళ్ల విత్తన వేరుశనగ మంజూరైందన్నారు. ఇప్పటికే తరిమెల, కొరివిపల్లి, చక్రాయిపేట, సోదనపల్లి ఆర్బీకేలకు 600 క్వింటాళ్ల కే6 విత్తన వేరుశనగ చేరిందన్నారు.

యాడికి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సబ్సిడీ విత్తన వేరుశనగకు రైతులు ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ మహబూబ్‌బాషా సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధర్ కార్డువెంట తీసుకెళ్లాలని ఆయన సూచించారు.

పామిడి: మండలంలోని 13 రైతుభరోసా కేంద్రాల్లో రాయితీ విత్తన వేరుశనగ కోసం రెండురోజులుగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఊపందుకుంటోంది. మండలానికి 1,600 క్వింటాళ్ల సబ్సిడీ విత్తన వేరుశనగ(కే-6 రకం) కేటాయించారు. రెండు రోజులుగా మండలంలో 362 మంది రైతులు విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఏఓ లీనా వసుంధర సోమవారం తెలిపారు.

రూ.6.44 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ జమ



యాడికి: మండలంలోని 14 పంచాయతీల్లో ఖరీఫ్‌లో పంటలు సాగు చేసి 13,780 ఎకరాల్లో నష్టపోయిన 5,512 మంది రైతులకు రూ.6.44 కోట్లు జమైందని ఏఓ మహబూబ్ బాషా సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఖరీఫ్ పంట నష్ట పరిహారానికి సంబంధించి హెక్టార్ వేరుశనగకు రూ.17వేలు, ఆముదం, జొన్నకు హెక్టార్‌కు రూ.8,500, పత్తికి హెక్టారుకు రూ17,500 కందులు, పెసలుకు హెక్టార్‌కు రూ.10వేల చొప్పున ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసిందన్నారు. ఖాతాల్లోకి నగదు జమ అవుతుండటంతో రైతులు బ్యాంకులకు క్యూ కడుతున్నారు.

రూ.3.20 కోట్లు విడుదల

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా 2,577 మంది రైతులకు రూ.3.20 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలైందని ఏఓ సోమశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రైతులకు సంబంధించిన బ్యాంకుల ఖాతాల్లో ఇన్‌పుట్ సబ్సిడీ జమ అయిందన్నారు. వేరుశనగ హెక్టారుకు రూ.17 వేలు, ఆముదం, జొన్నకు హెక్టారుకు రూ.8,800,పత్తికి హెకార్టుకు రూ.17 వేలు, కందులు, పెసలకు హెక్టారుకు రూ.10 వేలు పప్పుదినుసు పంటలకు హెక్టారుకు రూ.10 వేల చొప్పున ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేసిందన్నారు. ఖరీఫ్ సాగు సమయంలో ఖాతాల్లోకి నగదు జమవుతుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

1,505 మంది రైతులకు పరిహారం

పెద్దపప్పూరు: మండలంలో ఖరీఫ్‌లో పంటలు సాగుచేసి నష్టపోయిన 1,505 మంది రైతులకు ప్రభుత్వం రూ.1,87,88,572 పరిహారం జమ చేసినట్లు సోమవారం ఏఓ ఆంజనేయులు తెలిపారు. పంట నష్ట పరిహారానికి సంబంధించి ఎలాంటి సందేహాలున్నా సమీపంలోని రైతుభరోసా కేంద్రంలోని అధికారులను సంప్రదించాలన్నారు.

ఉరుములతో దద్దరిల్లిన పెద్దవడుగూరు



ఉరుముల దెబ్బకి ఎమ్మార్సీ కార్యాలయంలో కాలిపోయిన ఇన్వర్టర్, ఫ్యాన్

పెద్దవడుగూరు: మండలం ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకూ ఉరుములు, మెరుపులతో దద్దరిల్లింది. రాత్రి 10 గంటలకు చిన్నపాటి వర్షంతో ప్రారంభం కాగా 11:30 గంటల నుంచి ఉరుములు, మెరుపులు ప్రజలను భయాందోళనకు గురిచేశాయి. ఉరుముల దెబ్బకు ఎమ్మార్సీ భవనంలో ఫ్యాన్‌లు, ఇన్‌వర్టర్ కాలిపోయాయి. సుమారు రూ.30 వేల దాకా నష్టం వాటిల్లినట్లు ఎంఈఓ రాముడు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడం వల్ల తీవ్ర అంతరాయం ఏర్పడింది.

గార్లదిన్నెలో 10 మి.మీ. వర్షపాతం నమోదు

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి వర్షం కురిసింది. సోమవారం ఏఓ సోమశేఖర్ మాట్లాడుతూ మండలంలో 10 మి.మీ. వర్షపాతం నమోదైందన్నారు. వారం రోజులు నుంచి మండలంలో వర్షాలు కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. అలాగే అన్నదాతలు పొలాలను దుక్కులు చేస్తూ ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారన్నారు.

ప్రైవేటీకరణ విధానానికి స్వస్తి పలకండి



మాట్లాడుతున్న ప్రదీప్ యూ ఖడ్సే

గుంతకల్లు: కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రైవేటీకరణ వైపు చూపడం మంచి పద్ధతి కాదని ఏఐఆర్‌ఎంఎస్ జనరల్ సెక్రటరీ ప్రదీప్ యూ ఖడ్సే హితవు పలికారు. కేంద్ర పభుత్వం ఈ విధానానికి స్వస్తి పలికి కార్మికులకు బాసటగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఆల్ ఇండియా ఆర్‌ఎంఎస్ అండ్ ఎంఎంఎస్ ఉద్యోగుల 35వ ద్వై వార్షిక మహాసభను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆయనతోపాటు ఉపాధ్యక్షుడు పి.సురేష్, సహాయ కార్యదర్శి ముఖ్తార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తూ ప్రైవేటీకరణ వైపు మొగ్గు చూపుతుందన్నారు. అందులో భాగంగానే గుంతకల్లు ఆర్‌ఎంఎస్ ప్రాముఖ్యతను తగ్గించరన్నారు. ఈ విధానాలకు స్వస్తి పలకడంతో పాటు పాత పెన్షన్ విధానాన్ని పునర్ధుంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఆర్‌ఎంఎస్ గుంతకల్లు డివిజన్ కార్యదర్శి ఎం.జనార్దన్, ఏపీ సర్కిల్ కార్యదర్శులు మధుసూదన్‌రావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అక్షయ ప్రాతతో అమ్మవారికి అభిషేకం



కళాశలతో అమ్మవారి ఆలయం చూట్టు ప్రదక్షిణలు చేస్తున్న దృశ్యం

గుంతకల్లు: పట్టణంలోని వాసవీ ఆలయంలో కన్యకాపరమేశ్వరీ దేవి జయంత్సోవం, 63 త్రిపష్టి ప్రతిష్ట వార్షికోత్సవం సందర్భంగా సోమవారం మూడో రోజు అమ్మవారికి బంగారు అక్షయ పాత్రతో అభిషేకం నిర్వహించారు. వేకువజామునే అమ్మవారి మూలవిరాట్‌కు విశేష పుష్పాలంకరణ చేశారు. అనంతరం శ్రీ విష్ణు సహస్ర నామ పారయణం గావించారు. తొలిసారిగా అమ్మవారికి బంగారు అక్షయ పాత్రతో అభిషేకం నిర్వహించడం విశేషం. ఆర్యవైశ్యలు పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారి పాదాలకు అభిషేకం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు గోపా జగదీష్, కందూరి కృపాకర్, వెంకటేశ్వర్లు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



విష్ణు సహస్ర నామ పారాయణంలో పాల్గొన్న ఆర్యవైశ్య మహిళలు

ఆదమరిస్తే అంతే..

- అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ
- విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరి

ఫిబ్రవరి 6: యాడికి మండలం పుప్పాలలోని హరిజన వాడకు చెందిన రంగమ్మ(73) ఉదయం 10 గంటలకు ఉతికిన దుస్తులను ఇంటి ఎదుట ఉన్న రేకుల షెడ్డుపై ఆర వేసేందుకు వెళ్లింది. అక్కడ తెగిపడి ఉన్న వైర్‌ను పక్కకు వేసేందుకు చేతిలో తీసుకుంది. అప్పటికే తీగలో విద్యుత్ సరఫరా ఉండడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది

ఏప్రిల్ 1: యాడికి మండలం కోనుప్పలపాడు గ్రామానికి చెందిన జగన్నాథ, లక్ష్మీదేవమ్మ దంపతుల ఏకైక కుమారుడు దేవశేఖర్(23) వేములపాడులోని పొలంలో బోరు బావికి విద్యుత్ కనెక్షన్ బాగు చేసేందుకు లైన్‌మాన్‌కు ఫోన్ చేసి ఎల్‌సీ తీసుకున్నాడు. కరెంట్ స్తంభం ఎక్కి జంపర్లను సరి చేస్తుండగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్ కొట్టి తీగలపైనే పడ్డాడు. వెంటనే 108 అంబులెన్స్ ద్వారా తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్సకు స్పందించక మృతిచెందాడు.

మే 8: యల్లనూరు: మండలంలోని గడ్డంవారిపల్లికి చెందిన రైతు రాగిపిండి గోపాలరెడ్డి (48) పొలంలో పంటకు నీరు పెట్టేందుకు వెళ్లి స్టార్టర్ ఆన్ చేస్తుండగా విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు.



యల్లనూరు మండలం గడ్డంవారిపల్లిలో విద్యుదాఘాతంతో మృతిచెందిన రాగిపిండి గోపాల్‌రెడ్డి (ఫైల్)

తాడిపత్రి అర్బన్: దైనందిన జీవితంలో విద్యుత్ ఎంత అవసరమో , ఆదమరిస్తే అంతకన్నా ఎక్కువ ప్రమాదాలే జరుగుతున్నాయి. రోజు రోజుకూ పెరుగుతున్న వినియోగంతో పాటు ప్రమాదాల సంఖ్య కూడా పెరుగుతోంది. వేసవిలో పెరిగిన ఉష్ణోగ్రతలకు అనుగుణంగా విద్యుత్ వినియోగం అధికమైంది. గృహోపకరణాలు, వైరింగ్‌లో లోపాలు, విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గుల కారణంగా వినియోగదారులకు తెలీకుండానే నష్టం జరుగుతోంది. చిన్న చిన్నవే కదా అని ఆదమరిస్తే ఊహించని రీతిలో నష్టపోవాల్సి వస్తోంది.

జాగ్రత్తలు తప్పనిసరి

విద్యుత్ వినియోగం, భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలి. విద్యుత్ ఉపకరణాల మరమ్మతు, వైర్లు అతకడం తదితర పనులు సొంతంగా చేయడం ఏమాత్రం సరైనది కాదు. పైగా చిన్న చిన్న వ్యత్యాసాల కోసం ఆలోచించి ఇళ్లల్లో వాడే విద్యుత్ పరికరాలు, తీగలు నాసిరకమైనవి తీసుకోకపోవడం ఉత్తమం. వేసవిలో విద్యుత్ వినియోగం విషయంలో కూడా మరింత అప్రమత్తంగా ఉండాలి. తీగలు వేడెక్కే అవకాశం ఉండడంతో ఈ సమయంలో అధికంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. నియోజకవర్గ వ్యాప్తంగా లక్షా 15 వేల వరకు విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రధానంగా ఇంటింటికి వాడే విద్యుత్ తీగలు, పరికరాలు ఐఎస్ఐ మార్కు కలిగినవి మాత్రమే వినియోగించడం వల్ల ప్రమాదాలు అరికట్టవచ్చు. విద్యుత్తు లోడ్ అంతా ఒకే ఫ్యూజుపై పడకుండా చూసుకోవడం మంచిది. విద్యుత్ వినియోగించే ఉపకరణాలను బట్టీ తిన సామర్థ్యం ఉన్న తీగలు, పరికరాలు వినియోగించాలి. ఇళ్ళలో లోడ్ సర్క్యూట్ బ్రేకర్లు వేసుకుంటే,అధిక లోడ్ వచ్చినప్పుడు ట్రిప్ చేసి ప్రమాదాన్ని హెచ్చరిస్తాయి.

అవగాహన లేకపోవడంతోనే అధిక ప్రమాదాలు



ఇళ్లలో పాత వైరింగ్ ప్రమాదకరంగా ఉంటే వెంటనే తొలగించి వాటి స్థానంలో కొత్త వైరింగ్ చేసుకోవాలి. విద్యుత్తు పనుల్లో తర్ఫీదు పొందిన ఎలక్ట్రీషియన్‌తో మాత్రమే వైరింగ్ చేయించండి. సరైన ఎర్త్ లేకపోతే కొన్ని ఉపకరణాలు ద్వారా విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉంది. మూడు పిన్నులున్న ప్లగ్‌లు, సాకెట్లను మాత్రమే వినియోగించాలి. ఒకేచోట ఎక్కువ ప్లగ్‌లు వినియోగించడం వల్ల ప్రమాదాల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంది. – రఘు వెంకయ్య, ట్రాన్స్‌కో ఏడీఈ,

26న సలకంచెరువులో గంగమ్మ జాతర

శింగనమల: మండలంలోని సలకంచెరువు గ్రామంలో ఈ నెల 26న గంగమ్మ జాతర నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. 25న గ్రామంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఉదయం 6 గంటల నుంచి పూజ కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు.12 గంటలకు లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణోత్సవం ఉంటుందన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. 26న గంగమ్మ జాతర జరుగుతుందన్నారు. ఉదయం 6 గంటల నుంచి గంగమ్మకు బోనాలు సమర్పిస్తారన్నారు. అదే రోజు రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మొదటి బహుమతి రూ.50 వేలు ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, రూ.40 వేలు రెండో బహుమతి డీసీఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి, మూడో బహుమతి రూ.30 వేలు పరమేశ్వర రెడ్డి, శ్రీరాములు, నాలుగో బహుమతి రూ.20 వేలు అశ్వర్థ, లక్ష్మీ నరసయ్య, ఐదవ బహుమతి రూ.15 వేలు రమేష్, ఆరవ బహుమతి రూ. 10 వేలు బయ్యన్న, ఏడో బహుమతి రూ. 5,116 నారాయణ శెట్టి, ఎనిమిదో బహుమతి రూ. 3,116 అందజేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

గార్లదిన్నె: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో ఎవరైనా అల్లర్లు, గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ మహమ్మద్‌గౌస్ హెచ్చరించారు. సోమవారం ఆయన మా ట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. రాజకీయంతో ఒకరిపై ఒకరు గొడవలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో నిఘా ఉంచామన్నారు. అనవసరంగా ఎవరూ ఘర్షణలు పడరాదని, ప్రశాంతంగా జీవనం సాగించాలన్నారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య



కుళ్లాయి(ఫైల్)

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని చేనేత కాలనీలో సోమవారం అప్పులబాధ తాళలేక కుళ్లాయి(38) అనే వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. చేనేత కార్మికుడైన కుళ్లాయి పెట్టుబడి, కుటుంబ పోషణ కోసం రూ.4 లక్షల దాకా అప్పు చేశాడు. గత ఏడాది నుంచి మగ్గం పనులు సక్రమంగా జరగక పోవడం తో అప్పులు తీరే మార్గం కానరాక ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి అతడిని పామిడి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అతడికి భార్య విజయలక్ష్మి, కుమారుడు బాలాజి ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

క్రీస్తుతోనే సర్వమానవాళి రక్షణ

పామిడి: పట్టణంలోని బైపాస్‌లో ఉన్న క్రీస్తు కల్వరి పరిచర్య ప్రార్థన మందిరంలో రెండురోజుల పాటు నిర్వహిస్తున్న రక్షణ ఉజ్జీవ సువార్త సభలు ఆ సంఘ పాస్టర్ జీ సురేంద్రబాబు ఆధ్వర్యంలో మొదటిరోజు సోమవారం ప్రార్థనతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్య ప్రసంగీకులు పాస్టర్ ఓ రుబేను ప్రసంగించారు. క్రీస్తుతోనే సర్వమానవాళి రక్షణ సాధ్యమన్నారు. అంతకుముందు క్వయర్ బృందం ఆలపించిన గీతాలు పరవశింపజేశాయి. కార్యక్రమంలో అనంతపురం ఏఎల్ చర్చి పాస్టర్ టీఆర్ బాబు, క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

పొలంలో మోటార్ చోరీ

గుత్తి రూరల్: మండలంలోని అనగానదొడ్డి గ్రామ శివారులో ఉన్న పొలంలో మోటార్ చోరీకి గురైందని సోమవారం బాధిత రైతు హరినాథ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు.. గ్రామానికి చెందిన హరినాథ్ రబీ సీజన్‌లో వేరుశనగ పంట సాగు చేశాడు. గ్రామ శివారులో ప్రవహించే పుల్లేటి వాగులో మోటార్ ఏర్పాటు చేసి పైపుల ద్వారా రోజూ పంటకు నీరు అందించేవాడు. అయితే ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మోటార్, స్టార్టర్‌ను ఎత్తుకెళ్లారు. పంటకు నీరు పెట్టేందుకు వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గమనించిన రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గతంలో కూడా అనగానదొడ్డి గ్రామంలో ఆరుగురు రైతుల మోటార్లు, స్టార్టర్ బాక్సులు చోరీ చేశారన్నాడు. అలాగే పి.ఎర్రగుడి గ్రామంలో నాలుగు, పెద్దొడ్డి గ్రామంలో ఒక మోటారు, స్టార్టర్ బాక్సులు చోరీ చేశారన్నాడు. మోటార్లు, స్టార్టర్లు చోరీ చేయడం వల్ల పంటలు ఎండిపోతున్నాయని, చోరీలకు పాల్పడే వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.